క్లుప్తంగా

రోడ్లు శుభ్రం చేయాలి



పిచ్చి మొక్కలతో ఉన్న రోడ్డు

రంగంపేట: తమ కాలనీలోని రోడ్లు శుభ్రం చేయాలని రంగంపేట శివారు ఎస్టీ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం కావడంతో రోడ్లపై నీరు చేరి పచ్చగడ్డి, తుప్పలు, మొక్కలు మొలకెత్తి గుబురుగా ఉన్నాయని, ఆ దారిలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. విద్యార్థులు పాఠశాలకు ఈ దారి నుంచే వెళ్లాలని, పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయని ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఈ రోడ్లను శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

రోడ్డు పనులలో విగ్రహాల తొలగింపు

సీతానగరం: రాజమహేంద్రవరం రూరల్ కాతేరు నుంచి సీతానగరం ఆర్అండ్బీ రోడ్డు నాలుగు లైన్ల విస్తరణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న విగ్రహాలను అధికారులు తొలగిస్తున్నారు. వీటికి స్థానికులు, వివిధ పార్టీల నాయకులు సహకరిస్తుండడంతో ఈ కార్యక్రమం సజావుగా సాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో విగ్రహాల చేతులు విరిగిపోవడంతో వాటిని ఆర్అండ్బీ అధికారులు సరిచేసి ఇస్తామని చెప్పారు. అంబేడ్కర్, ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, స్థానిక నాయకులు, ప్రముఖుల విగ్రహాలు రోడ్డు ఇరువైపులా సుమారు 18 వరకూ ఉన్నాయి. ముందుగా ఆర్అండ్బీ అధికారులు ఆ విగ్రహాలకు సంబంధించిన కమిటీలతో సంప్రదించి తొలగింపు కార్యక్రమం చేపట్టారు.

నేడు కుంకుమ పూజలు

రాజానగరం: ప్రజా సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధిని కోరుకుంటూ స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దంపతుల ఆధ్వర్యంలో వేలాది జంటలు కుంకుమ పూజలు నిర్వహించనున్నాయి. సోమవారం ఉదయం 6.30 గంటలకు నియోజకవర్గంలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో కొలువైన జగన్మాత ఆలయాల్లో ఈ పూజలు జరుగుతాయి. పార్టీ నాయకులు, అభిమానులు జంటలుగా ఆయా గ్రామాల్లోని ఆలయాలలో అమ్మవార్లకు కుంకుమ పూజలు చేస్తారు. జాతీయ రహదారిపై సూర్యారావుపేట జంక్షన్‌లోని కనక దుర్గమ్మ ఆలయం వద్ద ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

చినుకు పడితే మునకే..



కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నిలిచిన నీరు

రాజానగరం: దివాన్ చెరువు కూడలి నుంచి శ్రీరామపురం వెళ్లే ఆర్అండ్బీ రోడ్డు చినుకు పడితే చాలు మునిగిపోతోంది. ఎంతోకాలంగా ఈ సమస్య ఉంది. ఇటీవల ఈ రోడ్డును ఎత్తు చేసి, సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఇరువైపులా డ్రైనేజీలు కూడా నిర్మించారు. అయితే నిర్మాణంలో నీరు వెళ్లే మార్గాలు సరిగ్గా చూడకపోవడంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డు జలమయమై ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. ఆర్అండ్బీ అధికారులు తక్షణమే స్పందించి, ముంపు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మండల సమావేశం

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ బి. శ్రీరామరాజు తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

శాంతి కోసం ప్రార్థనలు



ప్రార్థన చేస్తున్న ఫాదర్ మాణిక్యం

మధురపూడి: మణిపూర్ రాష్ట్రంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ ఫాదర్ మాణిక్యం ఆధ్వర్యంలో ఆదివారం కోరుకొండ ఎస్సార్ నగర్‌లోని ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఉపదేశి బెల్లపు డేవిడ్, సంఘ పెద్దలు బూసి మేరీకాంతం, థామస్, వరమ్మ, జోస్పిన్ పాల్గొన్నారు.

75 మంది రక్తదానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో స్థానిక ధన్వంతర బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని అనుశ్రీ ఫిలింస్ అధినేత, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ప్రారంభించారు.

బడిలోనే బలవర్ధక ఆహారం

- సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు
- చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యానికీ ప్రాధాన్యం
- పకడ్బందీగా జగనన్న గోరుముద్ద



అనపర్తి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

అనపర్తి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక మార్పులకు శ్రీకారం చుట్టింది. వివిధ పథకాలను ప్రవేశపెట్టడం ద్వారా పాఠశాలల అభివృద్ధి, విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా మరింత మెరుగైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జగనన్న గోరుముద్ద పథకాన్ని పగడ్బందీగా, అత్యంత సమర్థంగా అమలు చేస్తున్నారు.

పోషకాహారం

విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా తీసుకునేందుకు మెనూలో తరచూ మార్పులు చేస్తోంది. విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచి, శుచికరమైన ఆహారం అందిస్తోంది. రోజుకో రకమైన నాణ్యతతో కూడిన పోషక ఆహారాన్ని అందించేందుకు ఆ మెనూలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తోంది. జగనన్న గోరుముద్దను చిత్తశుద్ధితో అమలు చేస్తూ దాని కోసం రూ.కోట్లు వెచ్చిస్తోంది.

నాణ్యతకు ప్రాధాన్యం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పేరుతో అందించే మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వం అత్యంత నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టింది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి కుక్కింగ్ చార్జీలను సైతం పెంపుదల చేసింది. పెరిగిన చార్జీల ప్రకారం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.88, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 8.57 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది.

మెనూ ఇలా..

జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు రోజుకొక మెనూను అమలు చేయడంతో పాటు సోమవారం నుంచి శుక్రవారం ప్రతి రోజు ఉడికించిన గుడ్డు, రోజు విడిచి రోజు వేరుశెనగ చిక్కీని అందిస్తున్నారు.

సోమవారం: హాట్ పొంగల్, ఉడికించిన కోడి గుడ్డు/వెజ్ పులావ్‌తో ఎగ్ కర్రీ, వేరుశనగ చిక్కీ

మంగళవారం: చింతపండతో పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ

బుధవారం: కూరగాయలతో అన్నం, బంగాళాదుంప కూర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కీ

గురువారం: సాంబార్ బాత్/లెమన్ రైస్, టమాటా చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ,

శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశెనగ చిక్కీ

శనివారం: ఆకు కూరతో అన్నం, పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ

మండల పరిధిలో...

జగనన్న గోరుముద్ద పథకం ద్వారా మండల పరిధిలో 8 జెడ్పీ ఉన్నత, 3 ప్రాథమికోన్నత, 31 ప్రాథమిక పాఠశాలలు మొత్తం 42 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు మొత్తం 4,058 మంది ఉండగా వీరిలో సుమారు 3,200 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం



జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పటిష్టంగా అమలయ్యేలా అన్ని చర్యలు తీసుకోవడంతోపాటు పర్యవేక్షణ చేస్తున్నాం.

– నల్లమిల్లి సత్తిరెడ్డి, ఎంఈఓ–2, అనపర్తి.

జగనన్న గోరుముద్ద రుచిగా ఉంటోంది



జగనన్న గోరుముద్ద చాలా రుచిగా ఉంటోంది. భోజనంతోపాటు పోషకాలతో కూడిన రాగిమాల్ట్ ఇస్తున్నారు. రాగిజావ నాకు చాలా ఇష్టం. అదేవిధంగా ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం చేకూర్చే ఉడికించిన గుడ్డు ఇస్తున్నారు. జగనన్న గోరుముద్ద నాతోపాటు నా స్నేహితులందరూ ఇష్టంగా తింటున్నాం.

– సత్తి కోదండరామిరెడ్డి, తొమ్మిదో తరగతి, అనపర్తి బాలుర ఉన్నత పాఠశాల

భోజనం బాగుంది



జగనన్న గోరుముద్దలో పాఠశాలలో పెడుతున్న మధ్యాహ్న భోజనం ఎంతో బాగుటోంది. నేను రోజు మధ్యాహ్న భోజనం తింటున్నాను. నాడు–నేడు పథకంతో పాఠశాలలో అన్ని సదుపాయాలు కల్పించారు. నాణ్యమైన చదువుతోపాటు మాకు పౌష్టికాహారం అందిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వి.శ్రీతెలుగుతల్లి, ఐదోతరగతి, అనపర్తి బాలుర ఉన్నత పాఠశాల

నేడు ఎమ్మెల్యే రాజా పర్యటన

మధురపూడి: ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోమవారం మధ్యాహ్నం కోరుకొండ పెట్రోలు బంకు వద్ద, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. రోటరీ క్లబ్, జ్ఞాన సరస్వతీ పీఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అనంతరం స్థానిక శ్రీరస్తు కల్యాణ మండపంలో జరిగే వైఎస్సార్ సీపీ మండల సమావేశానికి హాజరవుతారు. ఈ సమావేశంలో గాడాల, మధురపూడి, నిడిగట్ల, బూరుగుపూడి, గుమ్ములూరు, బుచ్చెంపేట, దోసకాయలపల్లి, జంబూపట్నం, పశ్చిమగానుగూడెం, నరసాపురం, కణుపూరు, గాదరాడ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొంటారు.

ఏరియా ఆసుపత్రి తనిఖీ



ఏరియా ఆసుపత్రిని పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ సనత్‌కుమారి

అనపర్తి: స్థానిక ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయకర్త డాక్టర్ ఎం.సనత్ కుమారి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సేవలు పొందిన రోగుల వివరాలను అడిగి తెలుసుకున్న డీసీహెచ్ఎస్ ఆరోగ్యశ్రీ పోర్టల్‌లో రోగుల వివరాలను అప్‌లోడ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలు తీరు, ఆసుపత్రిలో శానిటైజేషన్‌ను పరిశీలించిన ఆమె పారిశుధ్యం విషయంలో మరింత శ్రద్ధ వహిం చాలని సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.రామగురెడ్డి పాల్గొన్నారు.

నూతన వార్డు మెంబర్లకు ఎమ్మెల్యే అభినందన



వార్డు సభ్యులుగా భారీ మెజార్టీతో ఎన్నికైన వల్లభశెట్టి శివపద్మిని సతీష్ దంపతులు, డి.మణికంఠలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి పంచాయతీ 1, 9 వార్డు మెంబర్లకు శనివారం జరిగిన ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన వైఎస్సార్ సీపీ మద్దతుదారులు వల్లభశెట్టి శివపద్మిని, దొండపాటి మణికంఠలను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఉపఎన్నికల్లో సంక్షేమమే విజయం సాధించిందని, ఎన్నికలు ఏవైనా వైఎస్సార్‌సీపీదే హవా అనే విషయం దీని ద్వారా మరో సారి రుజువయ్యిందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానుల ఆనందోత్సాహాల నడుమ ఇరువురు వార్డు మెంబర్లను ఎమ్మెల్యే దుశ్శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మండల విభజనపై దుష్ప్రచారం నమ్మవద్దు

ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ

పెదపూడి: మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తారనే దుష్ప్రచారం ప్రజలు నమ్మవద్దని కాండ్రేగుల గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ చెప్పారు. సంపర గ్రామంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో కలిసి ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెదపూడి మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తారు అని వస్తున్న ప్రచారంపై ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు వివరణ అడిగామన్నారు. దానిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మండలం విభజన అనేది స్టేట్‌పాలసీ అని, ఇతర మండలాలు విభజిస్తేనే ఈ మండలం కూడా విభజన జరుగుతుందని లేకుంటే విభజన జరగదని చెప్పారన్నారు. దీనిపై ప్రతిపక్షాలు దురుద్దేశంతో మాత్రమే ప్రచారం చేస్తున్నాయని వెంకటరమణ ఆరోపించారు. ఈ మండలం ఎట్టి పరిస్థితుల్లోను విడిపోదన్నారు. మండల ప్రజలంతా ఐక్యతగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, హితకారి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, రాజుపాలెం గ్రామ ఉప సర్పంచి నాగుమళ్ల వీరభద్రరావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి



విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధురపూడి: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని ఆదివారం కోరుకొండలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిల శేషగిరి ఆధ్వర్యంలో రాజీవ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఎస్సీ, బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, నాయకులు కర్రి గణేష్ష తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

సీతానగరం: చిన కొండేపూడిలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండలంలో నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా బొబ్బిల్లంక నుంచి చినకొండేపూడి వరకు బైక్ ర్యాలీ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికార పార్టీపై విశ్వాసానికి ఈ ఎన్నికలే నిదర్శనం

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి

అనపర్తి: పంచాయతీ వార్డు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీలో నిలిచిన అభ్యర్థులే అత్యధిక మెజార్టీతో విజయం సాధించారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పనితీరును అన్ని వర్గాల ప్రజలు విశ్వసిస్తున్నారనడానికి ఈ ఎన్నికలే నిదర్శనమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై రోజురోజుకు వ్యతిరేకత తీవ్రంగా పెరుగుతోందని, రాబోయే ఎన్నికల్లో విజయం టీడీపీదే అంటూ ప్రతిపక్ష నాయకుడు తమ నాయకులు, కార్యకర్తలను భ్రమలో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. మండలంలోని దుప్పలపూడి పంచాయతీ పరిధిలో 1, 9 వార్డు మెంబర్లకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులకు డిపాజిట్లు కూడా రాలేదన్నారు. దుప్పలపూడి ఒకటో వార్డుకు టీడీపీకి చెందిన అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిరసపల్లి నాగేశ్వరరావు తన కుటుంబానికి చెందిన సిరసపల్లి అమలను పోటీలో నిలిపారని, దీంతో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డితోపాటు టీడీపీకి చెందిన హేమాహేమీలందరూ కలిసి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారని అన్నారు. టీడీపీ నాయకులు అత్యుత్సాహంతో ప్రచారం చేసినా గత టీడీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు చేసిన అవినీతి అరాచకాలను మరచిపోని ఓటర్లు వైఎస్సార్ సీపీ మద్దతుదారులకే విజయాన్ని అందించారని అన్నారు. ఈ ఎన్నికల్లో డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచిపెట్టినా టీడీపీ సానుభూతిపరులకు డిపాజిట్లు కూడా దక్కలేదం ప్రజల్లో వారికి ఉన్న ఆదరణ ఏపాటిదో తేటతెల్లం అవుతోందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి నీతి, నిజాయితీలు, అవినీతి రహిత పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఇదో నిదర్శనమని అన్నారు.

రాబోయే సాధారణ ఎన్నికల్లో సైతం వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దుప్పలపూడి ఉప ఎన్నికల్లో గెలిచిన దొండపాటి మణికంఠ, వల్లభశెట్టి శివపద్మిని వారి విజయంలో కీలక భూమిక పోషించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు ఎస్ఎస్, దుప్పలపూడి పార్టీ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వల్లభశెట్టి రామసతీష్, నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు వల్లభశెట్టి శివపద్మిని, దొండపాటి మణికంఠ, దుప్పలపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం శివారున పామాయిల్ తోటలో పేకాటాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై కె.చిరంజీవి ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.3,490 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

200 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని రాయల్ హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ బిందు అన్నారు. కాతేరు పాత పంచాయతీ ఆవరణలో ఆదివారం కాతేరు యూత్ సర్కిల్ సహకారంతో రాయల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా రోగులను వైద్యసేవలు అందించారు.

వార్డు ఎన్నికల్లో ఫ్యాన్ హవా



కర్రి రుక్మిణి కుమారి, మూడో వార్డు రామవరం, అనపర్తి మండలం (ఏకగ్రీవం)



వల్లభశెట్టి శివపద్మిని, ఒకటో వార్డు దుప్పలపూడి, అనపర్తి మండలం (మెజార్టీ 121 ఓట్లు)



దొండపాటి మణికంఠ, తొమ్మిదో వార్డు దుప్పలపూడి, అనపర్తి మండలం (మెజార్టీ 135ఓట్లు)

పెదపూడి: అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, పెదపూడి మండలాల్లో శనివారం జరిగిన నాలుగు వార్డు సభ్యుల ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ హవా కొనసాగింది. నాలుగింటిలో ఆ పార్టీ మద్దతుదారులైన ముగ్గురు విజయం సాధించారు.

శ్రావణం.. శోభాయమానం



నగరంలోని పుష్కర ఘాట్

సీటీఆర్ఐ: నగరంలో శ్రావణ శోభ మొదలైంది. గురువారం నుంచి శ్రావణ మాసం ప్రారంభమైన నేపథ్యంలో గోదావరి ఘాట్లు, ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. భక్తులు రేవుల్లో పుణ్యస్నానాలు ఆచరించి, సమీపంలోని ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. శ్రావణ మాసం సందర్భంగా గోదావరి ఘాట్‌లను నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశాలతో ముందుగానే శుభ్రం చేయించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వర్షాలు పడతుండటంతో బురద ఏర్పడకుండా, ఘాట్లలో స్నానమాచరించడానికి వచ్చేవారు జారి పడకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు.

పుణ్యస్నానాలకు ఘాట్లు సిద్ధం

శ్రావణ మాసం సందర్భంగా భక్తులు, మహిళలు పుణ్యస్నానాలు ఆచరించడానికి గోదావరి ఘాట్లను సిద్ధం చేశారు. కోటిలింగాల, పుష్కర, సరస్వతి, గౌతమి, వీఐపీ తదితర ఘాట్లలో అన్ని వసతులు కల్పించారు. తెల్లవారుజామున స్నానాలకు వచ్చే వారికోసం విద్యుత్ దీపాలు అమర్చారు. అలాగే పిల్లలు, వృద్ధుల కోసం పుష్కర ఘాట్‌లో జల్లు స్నానానికి ఏర్పాట్లు చేశారు.

వ్యాపారుల్లో నూతనోత్సాహం

శ్రావణ మాసం సందర్భంగా వ్యాపారుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఈ ఏడాది ఆషాఢం తర్వాత అధిక శ్రావణం రావడంతో రెండు నెలలుగా వ్యాపారాలు నత్తనడకన సాగాయి. ఇప్పుడు పూలు, పండ్లు, ఇతర వస్తువుల అమ్మకాలు జోరందుకుంటున్నాయి. వరలక్ష్మి వ్రతంతో పాటు ప్రతి శ్రావణ శుక్ర, మంగళవారాల్లో మహిళలు ప్రత్యేక పూజలు ఆచరిస్తారు. దీంతో వస్త్ర దుకాణాలు కళకళలాడనున్నాయి. బంగారం వ్యాపారాలు కూడా ఊపందుకుంటాయి. శ్రావణ మాసంలో బంగారు రూపులు, ఇతర వెండి వస్తువులు కొనుగోలు చేయడానికి మహిళలు ఆసక్తి చూపుతారు. అలాగే పూజల నేపథ్యంలో పువ్వులకు డిమాండ్ బాగా పెరుగుతోంది. పూల ధరలు ఆకాశాన్నంటాయి.

25న వరలక్ష్మి వ్రతం

శ్రావణ మాసంలోని రెండో శుక్రవారం తెలుగు మహిళలు వరలక్ష్మి వ్రతం ఆచరించడం సంప్రదాయం. ఈ ఏడాది వరలక్ష్మి వ్రతం ఆగస్టు 25న వచ్చింది. మహిళలు ఇంట్లో ఉదయం వ్రతాలు ఆచరించి, సాయంత్రం అమ్మవారి ఆలయాలకు వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. శుక్రవారం భక్తుల రద్దీని దృష్టిలో ఇప్పటి నుంచే ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరి దేవి, వంకాయలవారి వీధిలోని వరలక్ష్మి, అష్టలక్ష్మీ దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు.

కోనేరులో కలువల సోయగం



కోరుకొండ దేవుని కోనేరులో కలువ పువ్వులు

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కోనేరులో వికసించిన కలువ పూలు భక్తులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. కోనేరులో స్నానానికి వచ్చే భక్తులతో పాటు, అటుగా వెళుతున్న వాహనచోదకులు సైతం వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు. శ్రావణమాసం కావడంతో అమ్మవారికి పూజలు చేయడానికి వీటిని తీసుకువెళుతున్నారు.

ఏపీఎన్జీవో మహాసభలకు ఉద్యోగుల పయనం

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరుగనున్న ఏపీ ఎన్జీఓ రాష్ట్ర మహాసభలకు నగరం నుంచి పలువురు ఉద్యోగులు ఆదివారం సొంత వాహనాల్లో బయలుదేరారు. స్థానిక ఎన్జీవో హోం నుంచి బయలుదేరిన వాహనాలను రాష్ట్ర జేఏసీ కార్యదర్శి డి.వేణుమాధవరావు జెండా ఊపి ప్రారంభించారు. నగరం నుంచి నాలుగు బస్సులు, 25 కార్లలో చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరుతున్నట్లు వేణుమాధవరావు తెలిపారు. మహాసభల్లో ఉద్యోగుల పలు డిమాండ్లను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకు వెళతామన్నారు.